అసలు నువ్వు అడదానివా!... ఒసేయ్ నాంచారీ, నువ్వు నెల్లూరెంకన్న మురానుంచి పారిపోయొచ్చిందానివి కాదంటే?''

'' అఁ... సర్లే దానికేంట్లేరా ఎదవా, కర్నూలు దోపిడీ సొమ్ముతో పారిపోయొచ్చిన తిరపతివి కావంట్రా నువ్వు!... నీకోసం ఈ ఊళ్ళోనే ఎతుకుతున్నాళ్ళే నీ యముడు బంగారయ్య!''

'' అఁ!''

(ఈవారం 9-2-84)

***   ***   ***

# గొలుసు ఖరీదెంత ?

''శ్రీకంఠం అన్నయ్యా, వదినా వచ్చారోయ్, తొందరగా కాళ్ళకు నీళ్ళు పట్రా!'' అన్న తన భర్త ఉపేంద్రం కేక విని ఇంట్లోంచి హడావుడిగా నీళ్ళు తెచ్చింది స్వాహ.

కాళ్ళు కడగడాలూ; కుశల ప్రశ్నలూ వగైరాలయ్యాక అన్నదమ్ములిద్దరూ వసారాలో దిగబడి పోగా స్వాహ, తన తోటికోడలు ఇంద్రాణిని వంటింట్లోకి తీసుకొని వచ్చి కూర్చోబెట్టి, కుంపట్లో కాఫీకి నీళ్ళు పెట్టింది.

ఇంద్రాణి మొహాన చిరునవ్వు మెరుస్తోంది. స్వాహ మొహంలో అసహనం తొంగి చూసింది. '' మీరు యూనియన్ కార్బైడ్ మనుషులు కనుక, జీతం నాలుగంకెల్లో వుంటుంది. కలకత్తా కనక, కారు కూడా వచ్చిందనుకుంటాను. ఇల్లు కట్టుకున్నారా?''

ఇంద్రాణి పెద్దగా నవ్వింది. ''మమ్మల్ని మా జీతం రాళ్ళతోనే కొలుస్తున్నావన్న మాట! చెట్టుకు తగిన గాలి ఉన్నట్టు, మాకు తగిన సమస్యలు మాకుంటాయని ఊహించ లేవుటమ్మా! రోజులు మారుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి. మీరు కూడా మాతో సమానంగా జీతాలు పుచ్చుకొనే రోజులు రావని నమ్మకమేమిటి? ఇంతా జేసి అన్నాదమ్ములిద్దరిదీ ఒకటే చదువుకదా!- సర్లేవమ్మా చెల్లెలా! నీతో ఇది ఎప్పుడూ ఉన్నదే గాని, ఏదీ, లేక లేక పుట్టిన మీ వంశోద్ధారకుడు?''

స్వాహ మొహంలో హఠాత్తుగా తొంగి చూసిన అసంతృప్తి ఆమె చేత నిట్టూర్పించి, ''ఏమిటో అక్కయ్యా! ప్రేమ కొద్దీ అట్లా అంటారు కానీ, మా జీతాలు పెరగటమూసరే, మేము ఎదగటమూ సరే, అనిపిస్తుంది.''

ఆమె లేచి పక్కవాటాలోకి వెళ్ళి అక్కడ ఆడుకుంటున్న తన రెండేళ్ళ పసివాణ్ణి ఎత్తుకొని వచ్చి ఇంద్రాణికి అందించింది. వెంటనే వాకిట్లోకి వెళ్ళి గదిలోకి సైగచేస్తూ భర్తను బయటకు పిలిచింది. ''ఏమిటి?'' అంటూ అతను బయటకు వచ్చాడు

''ఏమిటేమిటి? అక్కయ్యకు చీరె, జాకెట్టు పెట్టొద్దూ! రెండు రోజుల కన్నా ఎక్కువ ఉండరేమో, ఇవాళే తెచ్చి ఇంట్లో ఉంచుకోవటం మంచిది'' ..''పెట్లో ఏదో చీరె ఉన్నట్టుంది కదా! ఇప్పుడు మళ్ళీ కొనటం దేనికి? లేని పోని భేషజాలకు పోవటం మంచిది కాదు.''

"అవ్వా! అదా ..? ఆ నూలు చీరా! రాక రాక వాళ్ళొస్తే-అందులోనూ కలిగినింటి ఆడపడుచు- మనం పెట్టేది నూలు చీరా? మీరు వెయ్యి చెప్పండి లక్ష చెప్పండి, మనింటి కొచ్చిన ప్రతి వాళ్ళకీ మనం ఎంత దరిద్రులమో చెప్పుకోవటం నాకిష్టం లేదు కట్టుకొనే భాగ్యం నా కెట్లాగూ లేదు కొనే భాగ్యమయినా అబ్బనీయండి."

భార్య పట్టుదల కొత్తకాదు ఉపేంద్రానికి బరువుగా నిట్టూరుస్తూ అక్కడ్నుంచి కదిలాడు

★ ★ ★

ఆ సాయంత్రం దిగాలుబడ్డ మొహంతో ఉపేంద్ర ఆఫీసునుంచి వచ్చాడు. రెండు జంటల వాళ్ళూ సినిమాకు వెళ్ళి వచ్చారు. రాత్రి పడుకోబోయే ముందర భర్త చెవిలో నోరు పెట్టి అడిగింది స్వాహ. "పట్టుచీరె విషయం ఏమైంది?"

ఉపేంద్రం అవతలి వైపుకు తిరిగి పడుకున్నాడు. బరువుగా, విచారం నిండిన మాటల్తో అన్నాడు- "చీరె తేలేదు. డబ్బు తెచ్చాను."

"ఎంత?"

"నాలుగొందలు... రేపు నువ్వే చీరె కొనుక్కొని తెచ్చుకో."

"అబ్బ ఎంత మంచి వారండీ మీరు. నా పరువు నిలబెట్టారు!" స్వాహ భర్తను ఎడా పెడా దొర్లించింది. ముద్దు పెట్టుకుంది. నలిపి నల్లేరు కాడ చేసింది అతని నడుమును దిండుగా చేసుకొని అడ్డంగా పడుకొంటూ అంది - "అప్పు తెచ్చారా"?

"కాదు ... లంచం. లంచం పట్టాను." ఉపేంద్రం గిరుక్కున రెండో వైపుకు దొర్లాడు. స్వాహ తల కిందకు జారింది.

ఆమె లేచి కూర్చుంది. చిన్న బుచ్చుకున్న మొహంతో అంది. "ఎందుకండీ అంత కోపం? లంచం అన్నప్పుడల్లా అదేదో హత్యాకాండ అయినట్లు ఈసడించు కుంటారు? ఇంతకీ లంచమనేదేమిటి?- మీరు చేసి పెట్టిన పనికి పుచ్చుకొనే ప్రతిఫలం కదూ? ప్రతి ఫలం లేకుండానే అందరూ అన్నిపన్లూ చేస్తున్నారా? అసలు సృష్టిలో ఏపనిమాత్రం ఎదురుపని లేకుండా జరుగుతోంది? నా ఖర్మ కాలిపోయి మీ పాలబడ్డాను. ఇదే ఇంకో మగాడూ, ఇంకో మగాడు అయితే, లంచమో గించమో - జీతానికి నాలుగింతలు తెచ్చి ఇంట్లో పడేసేవాడు. నా మొహాన నూనె కాళ్ళ పెద్దమ్మ తాండవ మాడేదే కాదు."

"నోటి కొచ్చినట్టు వాక్కు. నాకు గవర్నమెంటు ఇచ్చే జీతమే నేను చేసే పనికి ప్రతిఫలం. ఇంకా ప్రతిఫలమేమిటి? పైగా లంచమనేది వాళ్ళకు వాళ్ళు ఎవళ్ళూ ఇవ్వరు నే నడిగితేనే ఇస్తారు. ఇవ్వాళ్టి మటుకు ఇవ్వాళ ఆ బడిపంతులు ఏడుస్తూనే ఇచ్చాడు గాని, నవ్వుతూ ఇచ్చాడా? ... నా ప్రాణానికి పడి ఆ పంతులూ, పంతులు పెళ్ళామూ ఎంత ఏడుస్తున్నారో!"

"ఎవడా పంతులు?"

"ఎవడా? ఒక దౌర్భాగ్యుడు! ఆరేళ్ళ క్రితం కావలసిన పే ఫిక్సేషన్ ఇవాళయింది. వాడికి వచ్చిన నాలుగువేలు ఎరియర్స్‌లోనూ నాలుగు వందలు నేను గుంజవలసి వచ్చింది మా ఎస్. టి వో. కు కూడా నేను పైస ఇవ్వలేదు అంతాతెచ్చి నీ చేతుల్లో పోసాను స్వాహా! ఇది విను- మనం చేసే ప్రతి ఆలోచనగాని, పనిగాని మన్లో ఒక రియాక్షన్‌ను పుట్టిస్తూంటుంది అ పని చెడ్డదయినప్పుడు ఈ రియాక్షన్ కూడా చెడ్డదే అయి, మనకు తెలియకుండానే మన అంతరాంతరాల్లో తిష్ఠ వేసుకుని కూర్చుని మనకు మనమే అపకారం చేసుకునే విధంగా మన చేత పన్లు చేయిస్తూంటుంది ఇవ్వాళ నేను చేసిన పని

తాలూకు రియాక్షన్ ఎప్పుడో ఒకప్పుడు మనకు దెబ్బకొడుతుందనే నానమ్మకం... నా మాటవిను... ఈ డబ్బు వాడవద్దు"

స్వాహ మూతిని వంకర్లు తిప్పింది. "సింగినాధం కదూ!" అంది.

★ ★ ★

మర్నాడు స్వాహ కొడుకు పుట్టినరోజు స్వాహ పొద్దున్నే తన కొడుకుతో బాటు ఇంద్రాణికి కూడా తలంటుపోసింది బజారుకు వెళ్ళి ఇంద్రాణికి పట్టుచీరె, జాకెట్టుతో బాటు, కొడుక్కు లాగూచొక్కా కొనుక్కొని వచ్చింది. ఇంద్రాణికి చీరెపెట్టింది. కొడుక్కు కల్యాణం బొట్టు పెట్టి, కొత్త బట్టలు తొడిగింది. పిల్లవాడిని కుర్చీ పీట మీద కూర్చొబెట్టింది తానూ తన భర్తా పిల్లవాడి నెత్తిన అక్షతలుంచి ఆశీర్వదించిన తర్వాత, ఇంద్రాణినీ, శ్రీకంఠాన్నీ కూడా పిల్లవాణ్ణి ఆశీర్వదించమంది.

ఇంద్రాణి పిల్లవాణ్ణి చూసి మురిసిపోయింది

తన మెళ్ళో ఉన్న గొలుసు తీసి పిల్లవాడి మెళ్ళో వేసింది.

వాడి నెత్తిన తాను కూడా అక్షతలుంచి వాణ్ణి ఎత్తుకుని ముద్దాడింది. "నీ కొడుకు సిరి అంతా వాడి కళ్ళల్లోనే ఉందమ్మా! వీడు మేధావి అవుతాడు. యే ఐ ఏ. యస్. ఆఫీసరో అయితే నీకు మేము కనిపిస్తామా చెల్లెమ్మా?" అంటూ వాణ్ణి ఎగిరవేసి పట్టుకుంది.

స్వాహ మొహంలో అసంతృప్తి మెరిసింది.

పిల్లవాడి చేతిలో ఇరవై రూపాయలు పెట్టి, నెత్తిన అక్షతలుంచి, వాణ్ని ఎత్తుకుని ముద్దాడాడు శ్రీకంఠం కూడా.

వాకిలి తలుపు చప్పుడైంది ఉపేంద్రం వెళ్ళి తలుపు తీసాడు. "నువ్వా కపర్దీ! రా,రా" అంటూ వచ్చిన వ్యక్తిని ఆహ్వానించాడు. "వీడు నా బాల్య స్నేహితుడు. భీమవరంలో సైకిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు," అంటూ కపర్దిని తన అన్నకూ, వదినెకూ పరిచయం చేసి, వీళ్ళనూ కపర్దికి పరిచయం చేసాడు.

అంతా భోజనాలు చేసారు. ఒంటరిగా చూసి కపర్దిని అడిగాడు ఉపేంద్రం - "ఏమిట్రా, అర్థాంతరంగా ఊడిపడ్డావ్?"

కపర్ది మొహంలో విషాదం తొంగి చూసింది "నా మిసెస్‌కు ఎనిమిదో నెలరా. బలహీనత వల్ల కాన్పు కష్టమయ్యేట్లుగా ఉంది. డాక్టరు ఖరీదైన ప్రిస్క్రిప్షన్లు రాసాడు. ప్రొల్యుటన్ డిపా ఇంజక్షన్లు, టానిక్కులు, పళ్ళు, పాలు వగైరా. ఓ అయిదొందలేమయినా నీ దగ్గర పుడతాయేమోనని..... అహఁహ:, నీ దగ్గర సిద్ధంగా ఉన్నాయని కాదు, నీ పరపతి నుపయోగించి పుట్టించ గలవేమోనని."

ఉపేంద్రం తెల్ల మొహం వేసాడు నూతిలోంచి మాట్లాడుతున్నట్లూ, నీళ్ళు నములుతున్నట్లూ హీనంగా నెమ్మదిగా అన్నాడు - "సారీరా బ్రదర్ నా పరిస్థితి ఎప్పటి లాగానే ఉంది. నా పరపతి కూడా అంతంత మాత్రమే. పైగా, ఐదూ పదీ కాదు సారీ... తేలేను ఏమనుకోకు" ఉపేంద్రం గొంతులో బాధ ధ్వనించింది.

"నో - నో, బాధ పడకు. నా దురదృష్టానికి నువ్వేం చెయ్యగలవ్! ఇంకో చోట ట్రైచేస్తాను" అన్నాడు కపర్ది

స్వాహ వాకిలి గుమ్మంలోకి వచ్చి భర్తతో అంది- "పిల్లవాడి కొత్త చొక్కాకు బాక్ ఓపెన్ పెట్టాడు హుక్‌లు ఎగుడు దిగుడుగా ఉన్నాయి. టైలర్ దగ్గరికి తీసుకెళ్ళి కొంచెం సరి చేయించుకుని తీసుకు

రాగూడదూ?''

''అట్లాగే'' అన్నాడు ఉపేంద్రం లోపలికి వచ్చి గుడ్డలు వేసుకుని, వాకిట్లోకి నడిచాడు పసివాణ్ణి ఎత్తుకుని ఉపేంద్రం వెనకాలే నడుస్తూ అన్నాడు కపర్ది- ''గొలుసు బాగుందిరా ఉప్పాయ్! నువ్వు చేయించావా, మీ అత్తవారు పెట్టారా?'' అన్నాడు.

ఉపేంద్రం నవ్వాడు ''నేను చేయించడమా? అది కల్లో మాట, మా అత్తవారూ పెట్టలేదు కాస్సేపు ముచ్చట కోసం మా వదినె తనది తీసి వాడి మెళ్ళో వేసింది''

పసివాడు కపర్ది చంకలోనే ఉండగా, ఇద్దరూ టైలర్ దగ్గరకు వెళ్ళారు. దోవ పొడుగునా బంగారం కొనటం ఎంతో కష్టంగా ఉందన్న విషయం మీద ఇద్దరూ చర్చించుకున్నారు. చివరికి కపర్ది, ''ఎట్లాగయినా సరే, ఈ ఏడాది మా ఆవిడకు ఇట్లాంటి గొలుసే చేయిస్తాన్రా. ఈ గండం గడిచి బయట పడితే చాలు,'' అన్నాడు, పిల్లవాడి మెళ్ళో గొలుసును చూపిస్తూ.

టైలరు పిల్లవాడి చొక్కా హుక్‌లను సరిచేసాడు. పిల్లవాణ్ణి ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. ''సార్, ఈ గొలుసుతో పిల్లవాడి మెడ అందంగా ఉందండి మా పిల్లవాడికి కూడా సరిగ్గా ఇటువంటిదే పులిగోరు గొలుసుండేది. ప్చ్.. ఏం చేస్తాం? బతికిచెడవలసి వచ్చింది అకాస్తా అమ్మేసుకున్నాను.''

ఉపేంద్ర ''పిల్లవాడిని ఇక్కడే ఉంచు పక్కకు వెళ్ళి కిళ్ళీ వేసుకుని వస్తాం'' అన్నాడు. వాళ్ళు వెళ్ళి కిళ్ళీ వేసుకుని వచ్చేటప్పటికి పిల్లవాడు కటింగ్ టేబుల్ మీద ఆడుకుంటున్నాడు. కపర్ది మళ్ళీ వాణ్ణి ఎత్తుకున్నాడు ఇద్దరూ బస్సుస్టాండ్ వైపు నడిచారు. పిల్లవాడి చేతిలో రెండు రూపాయలు పెట్టి, వాణ్ణి ఉపేంద్రానికి అందించి బస్సెక్కాడు కపర్ది. ''అప్పుడప్పుడు కొయ్యల గూడెం వస్తూండ్రా!'' అన్నాడు ఉపేంద్ర. 'అల్లాగే' అన్నట్లు తల ఊపాడు కపర్ది.

ఇంటికి వస్తూంటే చంకలో పిల్లవాడు అసహనంగా కదలటం మొదలుపెట్టాడు. ఇంట్లోకి రాగానే భార్యతో ''కొత్త బట్టల్తో పిల్లవాడు చికాకు పడుతున్నాడు. అవి విప్పేసి వాడికి మామూలు బట్టలు తొడుగు'' అంటూ వాణ్ణి భార్యకు అందించి తాను వసారాలో మంచం మీద నడుం వాల్చాడు ఉపేంద్రం.

★ ★ ★

సాయంత్రం కాఫీలయ్యాక, ''వెడతాం'' అంటూ ఇంద్రాణీ, శ్రీకంఠాలు బయల్దేరారు. స్వాహ, ఉపేంద్రాలు ''ఇంకో రెండు రోజులుండం''డని ఎంత బతిమాలినా వాళ్ళు వినలేదు.

అన్నీ సర్దుకున్నాక ఇంద్రాణి, ''చెల్లెమ్మా, నా గొలుసిస్తావూ?'' అంది

స్వాహ ''అయ్యో నా మతి మండా! పొద్దుట్నుంచీ అది వాడి మెళ్ళోనే ఉందా ఏమిటి ఖర్మ! నేనా విషయమే మర్చిపోయాను'' అంటూ ఉయ్యాల్లో నిద్రపోతున్న పిల్లవాడి మెళ్ళో చూసింది. గొలుసు లేదు!

పిల్లవాణ్ణి అటూ ఇటూ జరిపి ఉయ్యాలంతా వెతికింది. కంగారు కంగారుగా భర్తను కేకేసింది. ''ఏమండీ, ఒకసారిల్లా రండి'' అంటూ. ఉపేంద్రం వచ్చాడు ''గొలుసు కనపడటం లేదండీ'' అన్నది స్వాహ అతను కూడా మళ్ళీ పక్క అంతా వెతికాడు ''ఇక్కడే కదూ మధ్యాహ్నం పిల్లవాడికి బట్టలు మార్చింది?'' అనుకుంటూ ఇద్దరూ కలిసి మంచం దగ్గరా, దానికిందా పైనా, దుప్పటికీ నవ్వారుకూ మధ్యా అంతటా వెతికారు గొలుసు కనుపించలేదు!!

వసారాలో ఉన్న ఇంద్రాణి లోపలికి వచ్చింది ''ఏమిటి చెల్లెమ్మా?'' అంటూ. చిన్నబోయిన మొహంతో ''గొలుసు కనిపించటం లేదక్కయ్యా!'' అంది స్వాహ. ''ఎక్కడికి పోతుంది లేవమ్మా, ఇంట్లోనే

ఎక్కడో ఉంటుంది'' అంటూ ఇంద్రాణి కూడా వెతకటం మొదలుపెట్టింది. పిల్లవాడు తిరిగినవీ, తిరగనివీ-చోట్లు అన్ని వెతికారు ఇద్దరూ కలిసి.

గొలుసు దొరకలేదు!!!!

★ ★ ★

ఉపేంద్ర పక్క వాటాలోకి వెళ్ళాడు. అందులో బాంకు గుమాస్తా ఒకాయన ఉంటున్నాడు. ఉపేంద్రం ఆయన్ను, ఆయన భార్యను అడిగాడు. ''మీరేమయినా మా పిల్లవాడి మెళ్ళో గొలుసు చూసారా?'' అని ''పొద్దున్న చూట్టమే పిల్లవాణ్ణి, ఆ తర్వాత ఇంతవరకూ వాడు ఇటు రానూ లేదు-మేము చూడనూ లేదు. ఇంట్లోనే ఎక్కడో ఉంటుంది. వెతకండి అన్నయ్యగారూ!'' అందావిడ.

ఉపేంద్ర ఒక్క క్షణం ఆలోచించాడు. ఇంట్లో కొచ్చి బట్టలు వేసుకొని టైలర్ దగ్గరికి వెళ్ళాడు. అతనితో కొంచెంసేపు ఆ కబురూ ఈ కబురూ మాట్లాడి చివరకు అన్నాడు: ''చూడవోయ్, పొద్దున మా పసివాణ్ణి తీసుకొచ్చినప్పుడు వాడి మెళ్ళో ఉన్న గొలుసు ఇంటికెళ్ళాక చూస్తే లేదు. నీ కొట్లో గాని జారి పడిందేమో చూస్తావా''

టైలర్ తెల్లబోయాడు. ఒక నిముషం తర్వాత తేరుకొని ''అదేమిటి సార్, హుక్స్ సరిచేసి చొక్కా పిల్లవాడికి తొడిగినప్పుడు చూళ్ళేదా? ఇక్కడ పళ్ళేదు సార్, రోడ్డుమీద పడిందేమో?.... అరెరె ఎంత పనయింది సార్!'' అన్నాడు.

ఉపేంద్రం ''సరే, నా కోసం నువ్వు బాధపడకు. అడగవలసిన ధర్మంగా అడిగానంతే'' అంటూ అక్కడ్నుంచి కదిలాడు. రోడ్డుమీదికి వస్తూ భ్రమ తన్నుకు రాగా మురుగు కాల్వలోకి నిశితంగా చూసాడు. రోడ్డు అంతా పక్క చూపులు చూపుకుంటూ నడిచాడు. బస్సుస్టాండుకు వెళ్ళి కూలీవాణ్ణి కూడా గొలుసు గురించి అడిగి ''దొరకలే''దనిపించుకొని వెనక్కు తిరిగాడు.

అతను బిక్క మొహంతో ఇంట్లోకి అడుగుపెట్టగానే స్వాహ ఎదురు వచ్చి ఆతృతగా అడిగింది. ''దొరికిందా?'' అని. ''ప్చ్'' అంటూ చెయ్యి తిప్పాడు ఉపేంద్రం. ''వాళ్ళు బయల్దేరుతున్నారు'' అంది స్వాహ.

''అవున్రా ఉపేంద్రం, ఎట్టి పరిస్థితుల్లో వెళ్ళక తప్పదు. నాకు సెలవు లేదు'' అంటూ గదిలో నుంచి బయటకు వచ్చాడు శ్రీకంఠం.

''గొలుసు ఎక్కడికీ పోదు. ఎప్పటికోప్పటికి దొరుకుతుంది మూడు తులాల గొలుసది. దొరగ్గానే పంపటంలో మాత్రం అశ్రద్ధ చెయ్యకు'' అంటూ తాను కూడా బయటకు వచ్చింది ఇంద్రాణి.

పిల్లవాడి చేతిలో ఇంకో ఇరవై రూపాయలు పెట్టి ఇంద్రాణీ, శ్రీకంఠాలు బయల్దేరి వెళ్ళిపోయారు.

★ ★ ★

ఆ రాత్రి దంపతులిద్దరికీ కంటి మీద కునుకు లేదు. ''గొలుసు ఏమైంది?'' అన్న ప్రశ్న వాళ్ళిద్దరి చేతా చాలా మాటలు మాట్లాడించింది. కాని, ఆ చర్చలవల్ల తేలింది మాత్రం శూన్యం.

హఠాత్తుగా ఉపేంద్రానికి కపర్ది జ్ఞాపకం వచ్చాడు. ఒక రాత్రి వేళ పక్క మీది నుంచి లేచి కూర్చుని కపర్దికి ఉత్తరం రాయటం మొదలుపెట్టాడు ఉపేంద్ర. ''ఇక్కడ నువ్వు బస్సు ఎక్కుతున్నప్పుడు మా పిల్లవాడి మెళ్ళో గొలుసు చూసిన గుర్తుందా? వేళా కోళానికి గాని నువ్వు తీసి ఎక్కడైనా పెట్టావా? జ్ఞాపకం తెచ్చుకుని రాయి. ఏమీ అనుకోకు.''

తిరుగు టపాలో కపర్ది నుంచి సమాధానం వచ్చింది. ''బస్సు ఎక్కే హడావుడిలో పిల్లవాడి

మెళ్ళో గొలుసు ఉన్నదో లేదో నేను గమనించలేదు గొలుసును నే నసలు ముట్టుకోనే లేదు కూడా! నీ అమర్దా కొద్దీ అట్లా రాసావుకానీ ఉప్పాయ్. నీ పిల్లవాడి మెళ్ళోంచి గొలుసు తీస్తే నా మెళ్ళో నుంచి నేను తీసుకున్నట్టు కాదుట్రా? నిన్ను డబ్బడిగి, నన్ను నేను హీనపరుచుకోవటం వల్లనే కదూ నీవు నన్ను అనుమానించావు? ఆహా. . లేమి ఎంత చిత్రమైందిరా? మనస్సుల్ని దగ్గరకు తెచ్చి త్యాగభావాల్ని పెంచుతుందని అందరూ అనుకొనే లేమి మనకు మాత్రం అపకారమే చేస్తోంది. మన చిరకాల స్నేహాన్ని ఒక్క దెబ్బతో నేల కూల్చేస్తోంది. కలిమి కరుణిస్తుందేమో కాని, ఎంతటి వాణ్ణయినా లేమి లక్ష్యపెట్టదు కదా!- సరే నా మీదికి వచ్చిన ఈ అపవాదుకు నా ప్రతిక్రియ విను నీకు గొలుసు నెల లోపల దొరక్కపోతే నాకు మళ్ళీరాయి దాని ఖరీదు నే నిచ్చుకుంటాను ఏకమొత్తంగా ఇవ్వలేక పోయినా ఇన్‌స్టాల్‌మెంట్సులో నయినా ఇచ్చుకుంటాను. మన స్నేహాన్ని మాత్రం అట్లాగే ఉండనియ్యి!''

ఈ ఉత్తరం చదివి ఉపేంద్రం నిలువునా నీరుకారి పోయాడు ఈ ఉత్తరానికి తోడు, పక్క వాటా దంపతులు ఈ రెండు మూడు రోజుల బట్టీ ముభావంగా ఉంటున్నారు. పూర్వం, కనుపించినప్పుడ్లా నమస్కారాలు పెట్టే టైలర్ ఇప్పుడు తల వంచుకుని వెళ్ళి పోతున్నాడు ఈ పరిణామాల్తో ఉపేంద్రం తల తిరిగిపోయింది 'ఒక్క గొలుసు కారణంగా మూడు రోజుల్లో తను ఎంత మందిని దూరం చేసుకున్నాడు! చివరికి కపర్ది మనస్సు కూడా విరిగిపోయిందే' అన్న ఆలోచన అతని మనస్సును విపరీతమైన క్షోభకు గురి చేసింది. స్వాహ విషయం సరేసరి. వీధికి మోహం చూపించటమే మానేసింది. ఆ తర్వాత కాలంలో వాళ్ళు కడుపునిండా తిని, కంటి నిండా నిద్ర పోయిన రోజు ఒక్కటి కూడా లేదు.

★ ★ ★

పది రోజులు గడిచాయి. కలకత్తా ముద్రతో ఇంద్రాణి నుంచి ఉత్తరం వచ్చింది. "స్వాహకు ఆశీస్సులు. గొలుసు విషయం తేల్చేయటం మంచిది. అందులో మూడు తులాల బంగారం ఉంది. మజూరీ వగైరాలు తీసివేసి ఎంత హీనంగా లెక్క వేసినా అది రెండు వేలు చేస్తుంది. మా అమ్మ నాకు పెట్టిన గొలుసది. త్వరలో తేల్చేస్తే బాగుంటుంది- ఇంద్రాణి."

"మన కొంపలో సామానంతా అమ్మినా రెండు వేలు రావే! అంత సొమ్ము ఇప్పుడెక్కణ్ణుంచి తేవటం?'' అంటూ బేలతనం పోయాడు ఉపేంద్రం.

''అమ్మవలసివస్తే అమ్ముతాము కూడా అంతేగాని, బంధువర్గంలో అవమానం భరించగలమా?..... ఆఫీసులో ఓ నాలుగు కేసులు దొరుకుతాయేమో చూడండి'' అంది స్వాహ

కోపంతో మొహం కందిపోతూండగా ఉపేంద్ర అన్నాడు. 'కేసులా? ఆఁ, ఆఁ..... పట్టానుగా! అది కొట్టనే కొడుతోంది ఇంకా బుద్ధి రాలేదా?''

స్వాహ మాట్లాడలేదు

నాలుగు రోజులు పోయాక, "క్రిస్మస్ పండగ అడ్వాన్సు రెండొందల యాభై, ఇంటాయన్ను ఐదొందలు అప్పు అడగ్గా ఆయనిచ్చిన సొమ్ము రెండిందల యాభై, వెరశి ఐదొందలు ఇదిగో'' అంటూ స్వాహకు డబ్బు చూపించాడు ఉపేంద్ర. అపూటే ఆ ఐదొందలూ కలకత్తాకు మనీయార్డరు చేసింది స్వాహ.

సంక్రాంతి ఎప్పుడు వచ్చి వెళ్ళిందో వాళ్ళకు తెలియదు

మిగిలిన డబ్బును పూడ్చటానికి వాళ్ళు ఇంటి ఖర్చును చాలా తగ్గించుకున్నారు అద్దం ''పగిలి పోయిందండీ'' అని స్వాహ అంటే, "నీళ్ళల్లో చూసుకుని బొట్టు పెట్టకో'' అన్నాడు ఉపేంద్రం.

నెలరోజులు గడిచేసరికి మిగిలిన సొమ్మును పూడ్చటానికి ఇంట్లో సామాను అమ్మక తప్పదనే నిర్ణయానికి వచ్చాడు ఉపేంద్ర. అయిష్టంగానే ఒప్పుకొంది స్వాహ రేడియో అమ్మారు వాచీ అమ్మారు. స్టీలు కుర్చీ, కొయ్య కుర్చీలు రెండూ అమ్మారు సైకిలు అమ్మబోతున్నప్పుడు, "మీరు అరమైలు దూరం ఆఫీసుకు రోజూ నడిచి వెళ్ళి వచ్చి నీరసంతో కూలబడితే నేను చూడలేనండీ!" అంటూ స్వాహ గుడ్లనీరు కుక్కుకుంది.

"ఇటువంటి మాటల్నే, ఆ బడిపంతులు భార్య కూడా అని ఉంటుందని అర్థంచేసుకో!" అన్నాడు ఉపేంద్ర. ఆ వచ్చిన ఏడొందల్నీ మనియార్డరు చేసింది స్వాహ.

ఉగాది పదిరోజు లుండనగా ఇంద్రాణినుంచి మళ్ళీ ఉత్తరం వచ్చింది. "మిగిలిన ఎనిమిది వందలూ ఎంత త్వరగా పంపిస్తే అంత సంతోషం. నేను పండక్కు మా అమ్మగారింటికి వెళ్ళాలనుకుంటున్నాను" అని.

ఆలోచించగా ఆలోచించగా, అమ్మితే బాగా డబ్బొచ్చే వస్తువు వాళ్ళకు ఇంకా ఒకటి మాత్రమే కనుపించింది అది పుస్తెల తాడు. పుస్తెలతాడు తియ్యటం కోసం తన మెళ్ళో భర్త పసుపుకొమ్ముతాడు కడుతున్నప్పుడు స్వాహ బావురుమంది. "ఏమండీ, మీ చేతుల్తో కట్టినదాన్ని, మీ చేతుల్తోనే తీసేస్తున్నారా! ఇట్లాగే అన్ని పన్లూ మీ చేతుల్తోనే చేసేస్తారు కదూ!"

ఉపేంద్రం కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. బొంగురు గొంతుకతో అన్నాడు. "పిచ్చిదానా అవేం మాటలు! దీన్ని ఇంగ్లీషులో ఏమంటారో తెలుసా? 'వి-టి నెక్ లెస్' అంటారు 'వెర్మీలియన్ - టర్మరిక్ నెక్‌లెస్' అని పూర్తి పేరు. అంటే కుంకుమ-పసుపు తాడేననుకో. కానీ, మరినెక్ లెస్సే. ఏమంటావు?" పిచ్చిగా నవ్వాడు ఉపేంద్ర.

మిగిలిన ఎనిమిది వందలూ ఇంద్రాణికి మర్నాడే మనియార్డరు చేసింది స్వాహ.

★ ★ ★

ఉగాది నాడు పొద్దున్నే పసివాడికి నీళ్ళుపోసి పెట్టెలో అడుగున దాచిన, వాడి పుట్టిన రోజు పండగనాటి కొత్తబట్టలు తీసింది స్వాహ. లాగూ దులిపింది. చొక్కా కూడా దులపబోయింది.

చొక్కా హుకకు తగులుకొని గొలుసు వేలాడుతోంది!!!

ఒక్క క్షణం పాటు ఆమె మనస్సు మొద్దుబారి పోయింది.

వెంటనే తేరుకొని, "గొలుసండీ గొలుసు! గొలుసు దొరికిందండీ!" అంటూ ఇంకా నిద్రపోతూన్న భర్తను అమాంతం లేపేసింది. కళ్ళు నులుముకుంటూ లేచాడు ఉపేంద్ర. గొలుసు చేతిలోకి తీసుకున్నాడు. పేలవంగా ఒక నవ్వు నవ్వాడు.

"ఇప్పుడు దీని ఖరీదెంతో తెలుసా స్వాహా." అన్నాడు.

"ఎంత?"... "నాలుగు వందలు నాకు ఇవ్వవలసి వచ్చినప్పుడు ఆ బడిపంతులు గుండెల్లో రగిలిన మంటంత."

స్వాహ మాట్లాడలేదు.

( విజయ మాసపత్రిక ఫిబ్రవరి 78)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★